క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం మాఘ మాసం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దస్తగిరి స్వామికి ప్రత్యేక ఫాతెహాలు

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లెలో శుక్రవారం గ్రామస్తులు దస్తగిరిస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఏడాదికో సారి స్వామి వారి దర్గాను ప్రత్యేకంగా అలంకరించి గ్రామస్తులంతా కలిసి కందొరిలా ఫాతెహాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు తెలిపారు. పూజల్లో భాగంగా గ్రామం బంధువులతో కిక్కిరిసింది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జెండాలు, పూల సూచికాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పరామర్శ

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రం నర్సిరెడ్డిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారం క్రితం నర్సిరెడ్డి నంద్యాల పట్టణంలో మోటర్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికిగురై గాయాల పాలయ్యాడు. అప్పటి నుంచి అక్కడే ఓ వైద్యశాలలో చికిత్సలు పొంది ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

త్వరలో నూతన రోడ్డు..

అనంతరం ఆళ్లగడ్డకు వెళ్తున్న ఆయనకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. చాలా ఏళ్లుగా పెద్దకంబలూరు మెట్ట నుంచి గ్రామంలోకి చేరుకునే తారు రోడ్డు దెబ్బతిని రాక పోకలకు ఇబ్బందిగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభింపజేయించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటి చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జెల రాఘవేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర కమిటీ సభ్యుడు గంగిశెట్టి తిమ్మయ్య, నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి,గంగుల రామిరెడ్డి,సింగం వెంకటేశ్వరరెడ్డి,మండల కో ఆప్షన్ మెంబర్ మదార్ సాహెబ్, చంద్రారెడ్డి,రమణారెడ్డి,పాణ్యం చంద్ర, జయరాముడు ఉన్నారు.

ఈ- కేవైసీ తప్పనిసరి

గోస్పాడు: రబీలో భాగంగా పంటలు సాగు చేసిన రైతులు ఈ-కేవైసీ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో సిబ్బంది చేస్తున్న ఈ-కేవైసీని శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గోస్పాడు, దీబగుంట్ల, కానాలపల్లె, ఎం.కృష్ణాపురం, సాంబవరం గ్రామాల్లో సిబ్బంది ఈ-పంట నమోదును సూపర్‌చెక్ చేస్తున్నట్లు తెలిపారు. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 20,152 ఎకరాలు కాగా 14,387 ఎకరాల్లో పంటలు సాగు చేశారని చెప్పారు. ఈ-పంట నమోదు ప్రక్రియ ఇప్పటి వరకు 95శాతం పూర్తయ్యిందని, ఈ-పంట నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయింకోవాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో 4,471మంది రైతుల్లో వెయ్యి మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు వెంటనే చేయించుకోవాలని కోరారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం నాగరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల కనీస వేతనంతో పాటు కేంద్రాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. సెల్‌ఫోన్లకు నెట్ సౌకర్యాలు లేక గ్రామాల్లో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకురాళ్లు నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, హరిత, నాగలక్ష్మి, నాగరాణి, సునీత పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ఆళ్లగడ్డ: అడవికి నిప్పు పెడితే మానవాళికే ముప్పు మారుతుందని అటవీ శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. చాగలమర్రి మండలం కదిరిపురం తండాలో శుక్రవారం అడవికి నిప్పు.. అది మనకే ముప్పు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల పక్షులు, చెట్లు, ఔషధమొక్కలు సమూలంగా నాశనమవుతాయన్నారు. అడవిలో నిప్పు రాజుకుంటే తమకు సమాచారమివ్వాలని కోరారు. సర్పంచ్ లక్ష్మీబాయి, ఎఫ్‌బీఓలు నగేష్, సుభాష్, మదనగోపాల్ ఉన్నారు.

భక్తుల కొంగు బంగారం జంబులా పరమేశ్వరి

- నేడు చండీయాగం
- రేపు బోనాల పండుగ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కుందూ నది ఒడ్డున వెలసిన జంబులా పరమేశ్వరి(జంబులమ్మ) జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉంటూ నీరాజనాలు అందుకుంటున్న అమ్మవారి వేడుకలు ఈనెల 4, 5, 6 తేదీల్లో ఘనంగా జరగనున్నాయి.

159 ఏళ్ల క్రితం..

దాదాపు 159 ఏళ్ల క్రితం జంబులాపరమేశ్వరి ఆలయం కుందూనది, మద్దిలేరు వద్ద ఉండేది. అప్పట్లో రైతులు, రజకులు అమ్మవారిని సేవించే వారు. అమ్మవారిని దర్శించుకున్న వారి కోరికలు నెరవేరుతుండటంతో క్రమేపీ భక్తుల సంఖ్య పెరిగింది. 23 ఏళ్ల క్రితం ఆలయం జీర్ణోద్ధరణకు నోచుకుంది. గతంలో ఆలయానికి వెళ్లాలంటే మద్దిలేరులో దిగి, ప్రవాహాన్ని దాటి వెళ్లాల్సి ఉండేది. అయితే వంతెన, సీసీ రోడ్డు నిర్మించడంతో ఆలయానికి వెళ్లడానికి మార్గం సుగమంగా మారింది. పచ్చని చెట్ల మధ్య ప్రకృతి ఒడిలోనున్న ఆలయం ప్రశాంతతను చేకూర్చుతుంది. ప్రతి మంగళ, శుక్రవారాలు, పండుగ రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు. ఏటా మాఘ మాసం పౌర్ణమి రోజున అమ్మవారికి బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. పండుగ రోజున మహిళలు మేళా తాళాలు, తప్పెట్లతో అమ్మవారికి బోనం (ప్రసాదాలను) సమర్పిస్తారు. వేడుకను తిలకించడానికి భక్తులు తరలివస్తారు.



జంబులాపరమేశ్వరి అమ్మవారు



జంబులాపరమేశ్వరి దేవాలయం

నేటి నుంచి ఉత్సవాలు..

ఈనెల 4న శారదా జ్యోతిష్య పీఠాధిపతి మాడుగుల నాగేంద్రశర్మ సారథ్యంలో అమ్మవారికి శ్రీసూక్త విధాన క్షీరాభిషేకాలు, చండీ యాగం నిర్వహిస్తారు. 5న పట్టణంలోని పలు ప్రాంతాలు, గ్రామాల నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. బోనాల పండుగ రోజున అమ్మవారు వెండిచీరలో భక్తులకు దర్శనమిస్తారు. 6న గార్దబాల పోటీలు జరుగుతాయి.

ఏర్పాట్లు పూర్తి

బోనాల పండుగకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేస్తాం. ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశముండటంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– గాండ్ల జగన్‌మోహన్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి

భక్తిశ్రద్ధలతో తిక్కస్వామి ఉరుసు

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని సాయిబాబా నగర్‌లో వెలసిన శ్రీహజరత్ సయ్యద్‌షా షెహన్‌షా అవులియా చిస్తివుల్ ఖాదరి ఖుద్దుహు (తిక్కస్వామి) ఉరుసు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేడుకకు పట్టణ పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించున్నారు. దర్గా శాశ్వత ధర్మకర్తల నిర్వహణలో పక్కీర్లు స్వామి వారి లీలలు, మహత్యాలను భక్తులకు వివరించారు. భక్తులు స్వామి వారికి వివిధ రకాల పూలు, చాదర్‌ను సమర్పించి ఫాతెహాలు నిర్వహించారు. రాత్రి ఖవ్వాలి పోటీలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, భద్రత చర్యలు చేపట్టారు.



భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా పరిసరాలు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- రూ.2.10 లక్షల ఎరువుల విక్రయాల నిలిపివేత

నంద్యాల(అర్బన్): పట్టణంలో ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల అమ్మకాలకు సంబంధించి సరైన రికార్డులు చూపించని న్యూ శ్రీరామకృష్ణ ఏజెన్సీస్, న్యూ శ్రీ వసువాహిని ఏజెన్సీలకు సంబంధించి రూ.2.10 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలను స్టాప్ సేల్ ఇచ్చారు. సరైన వివరాలు సమర్పించిన తరువాత, ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్‌ఆర్‌ఓ ఖాన్, అగ్రికల్చర్ ఆఫీసర్ రూపస్, అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, నంద్యాల ఏఓ స్వప్నికారెడ్డి బృందం రికార్డులను పరిశీలించి సరైన పత్రాలు లేకపోవడంతో రెండు దుకాణాల్లో ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపి వేశారు. ఎఫ్‌ఆర్‌ఓ ఎంఏ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం యజమాని ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకే ఎరువులను విక్రయించాలని, హోల్‌సేల్ డీలర్లు ప్రతి రిటైల్ దుకాణానికి ఎరువులు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు.



ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఆళ్లగడ్డ: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి వాసు తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులు, న్యాయవాదులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాల వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని, ఇరువర్గాలకు అర్థమయ్యేలా న్యాయవాదులు, పోలీస్ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, జూనియర్ సివిల్ జడ్జి శైలజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సోమశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, గంగనాథ్‌బాబు, ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి వాసు

ఈ – క్రాప్ తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న డీఏఓ మోహన్‌రావు

ఆళ్లగడ్డ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలంటే రైతులు తాము సాగు చేసిన పంటల నమోదు (ఈ -క్రాప్) తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. రూరల్ మండలం ఎస్.లింగందిన్నె గ్రామ ఆర్బీకే లో శుక్రవారం గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆర్బీకే సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పంటల సాగు, ధాన్యం విక్రయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కిశోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

శ్రీశైల భ్రామరికి ఊయల సేవ



స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తి పీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేదపండితులు,అర్చకులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఆశీనులు చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల, సహస్రనామపూజలు శాస్త్రోక్తంగా చేశారు. అలాగే.. గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం అధికారులు ప్రత్యేక అభిషేక, కుంకుమార్చనలు నిర్వహించారు. అంకాలమ్మ అభిషేకానికి ముందుగా లోక కల్యాణం కోసం అర్చకులు శాంతి సంకల్పాన్ని పఠించి మహాగణపతి పూజ చేశారు. ఆ తరువాత అంకాలమ్మ తల్లికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం పూజలు చేశారు. అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి పథకాల అమలు తీరు, లబ్ధిపొందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు స్వచ్ఛందంగా సంతోషంగా తమకు చేకూరిన లబ్ధిని, ఎలా సద్వినియోగం చేసుకున్నది వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి, మరింత మెరుగైన పాలన అందించేందుకు గడప గడపకు వస్తున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పేదల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్న సీఎం వాటి పరిష్కారానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పథకాల నగదు జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మండల అధికారులు, నాయకులు నరేంద్రరెడ్డి, శరత్‌రెడ్డి, బాలవెంకటరెడ్డి, ఎంపీటీసీ హరినాథ్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): జిల్లా కాంట్రాక్ట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జిల్లా కాంట్రాక్ట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా ఫారాహీనాజబీన్, ట్రెజరర్‌గా సురేష్‌బాబు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా శివ ప్రసాద్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు ఏవైనా తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

అనధికారిక స్తంభాలకు విద్యుత్ తీగలు లాగొద్దు

శిరివెళ్ల: గ్రామాల్లో అనధికార స్తంభాలకు విద్యుత్ తీగలు లాగితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామగంగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతు గోవిందపల్లెలో గత నెల 15న అనధికారిక స్తంభాన్ని ఎక్కి గడ్డం భాస్కర్ విద్యుదాఘాతంతో మరణించాడన్నారు. ఆ స్తంభాన్ని, తీగలను ఈ నెల 2న సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ప్రైవేట్ హెల్పర్ మరణంతోనే సదరు స్తంభాన్ని తొలగించామని తెలిపారు. అయితే కొందరు స్తంభాల తొలగింపుపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా, విద్వేషాలు పెంపొందించేలా పోస్టింగ్‌లు పెడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ



శనగల బసవన్న కు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి గురువారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేశారు. అనంతరం విశేష అన్నాభిషేకాలు నిర్వహించి నానపెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.

అందరి సహకారంతోనే ఉత్తమ పీడీగా ఎంపిక

నంద్యాల(అర్బన్): డీఆర్‌డీఏ, వైకేపీ ఉద్యోగుల సహకారంతోనే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రాజెక్టు డైరెక్టర్‌గా తనను ఎంపిక చేశారని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ పీడీగా, స్టాల్‌కు రెండవ బహుమతి, సెకటానికి మూడో బహుమతి రావడానికి కృషి చేసిన పీడీ శ్రీధర్‌రెడ్డిని వైకేపీ సిబ్బంది శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితోనే రిపబ్లిక్ డే రోజు బహుమతులు అందుకున్నామని చెప్పారు.



పీడీని సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ చేరిన పార్వేట పల్లకీ



పుర వీధుల్లో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ శుక్రవారం ఆళ్లగడ్డలో కొలువుదీరింది. పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వాములను పట్టణ వాసులు బారులు దీరి దర్శించుకున్నారు. పలు తెలుపులపై కొలువు దీరిని ఉత్సవ పల్లకీకి ప్రజలు విశేష పూజలు చేశారు. స్వామి వార్ల రాకతతో పట్టణంలోని ఇళ్లు బంధుమిత్రులతో కిటకిటలాడుతున్నాయి.

సాధువులకు దుస్తుల పంపిణీ

పార్వేట ఉత్సవ పల్లకీ వెంట వచ్చే సాధువులకు అన్నం పెట్టడంతో పాటు ఉచితంగా వస్త్రాలను అందిస్తున్న సుబ్బరాయడు సేవలు ఎనలేనివని సీఐ గంగనాథబాబు అన్నారు. శ్రీ అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ పల్లకీ ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకున్న సందర్భంగా ఏటా సుబ్బరాయుడు కుటుంబం సాధువులు, యాచకులకు వస్త్రాలు పంపిణీ చేస్తారు. అందులో భాగంగా శుక్రవారం ఉత్సవ పల్లకీ తమ వీధిలోకి వచ్చిన సందర్భంగా సీఐ చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు.



సాధువుకు వస్త్రాలు అందజేస్తున్న సీఐ గంగనాథబాబు

పోలీస్ స్టేషన్ తనిఖీ

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాలలోని డిస్ట్రిక్ట్ క్రైం రికార్డు బ్యూరో స్టేషన్‌ను అడిషనల్ ఎస్పీ రమణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సీఐ జయరాముడుతో పలు కేసులకు సంబంధించిన రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆఫీసు సిబ్బందికి కేటాయించిన విధులకు హాజరు అవుతున్నారా లేదా అంటూ ఆరా తీశారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.సీసీ రాఘవేంద్ర, ఎస్‌ఐ అశోక్, రమేష్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రమణ

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: క్షేత్రంలో శ్రీగంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు వేదపండితులు, అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి అలంకారమండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేదపండితులు రవిశంకర అవధాని తదితరులు పాల్గొన్నారు.



పల్లకోత్సవంలో ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న దృశ్యం

విద్యావ్యవస్థ బలోపేతానికి పెద్ద పీట

దొర్నిపాడు: విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పాఠశాలలను సందర్శించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ నాగఅనసూయ నిర్వహిచారు. ఈసందర్భంగా ప్రాథమిక విద్య, మధ్యాహ్న భోజనం అంశంపై సమీక్ష రాగా ఎంఈఓ అబ్దుల్ కరీం మాట్లాడుతుండగా.. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటికి వెళ్లి భోజనం చేసేవారికి గుడ్డు, చిక్కీలు ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని జెడ్పీటీసీ శకుంతల ప్రశ్నించగా.. చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. భోజనం బడిలో చేసినా చేయక పోయినా గుడ్డు, చిక్కీలు ఇవ్వాల్సిందేనన్నారు. వెంటనే ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లలా తీర్చిదిద్దిందని చెప్పారు. మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 6 పాఠశాలల అభివృద్ధికి రూ.1.53 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రెండో విడతలో 15 పాఠశాలలను ఎంపిక చేసి రూ.6.37 కోట్లను వెచ్చిస్తోందన్నారు. ఏఓ శ్రీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2003ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని దీనిపై అవగాహన పెంచేందుకు విద్యార్థులతో కలిసి గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తామని సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయిల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మండలానికి రూ.6.33కోట్లు మంజూరు చేసిందన్నారు. దొర్నిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, క్రిష్టిపాడు, ఉమాపతి నగరం రామచంద్రాపురం గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్, రెవెన్యూ, ఉపాధి హామీ, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పశువైద్యాధికారులు హరిత, పుల్లయ్య, పావని, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏపీఎం బాబు, సీహెచ్ఓ బాషా, డాక్టర్ రుహుల్లా, వార్డన్ రాముడు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించండి

రుద్రవరం: అసంపూర్తిగానున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముత్తలూరు, నర్సాపురం, ఆర్.నాగలవరం గ్రామ సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. అలాగే అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలను పరిశీలించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఆర్.నాగలవరంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.